క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన తలారి రంగయ్య



వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై చర్చించారు. రాబోవు రోజుల్లో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలి..? పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలా అండగా నిలవాలన్న దానిపై చర్చించినట్లు రంగయ్య తెలిపారు. భవిష్యత్తులో మంచి రోజులు రానున్నాయని, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్ జగన్ సూచించినట్లు తెలిపారు.

బొమ్మనహాళ్ ఈఓపీఆర్‌డీగా దాస్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఈఓపీఆర్డీ దాస్

బొమ్మనహాళ్: మండల ఈఓపీఆర్‌డీగా దాస్ సోమ వారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న విజయమ్మ గత నెల ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఆయన బాధ్యతల స్వీకరించిన తర్వాత పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

బెల్టులు, నోట్ బుక్స్ సరఫరా



బెల్టులు, నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓలు-1,2లు చంద్రశేఖర్, సాయికృష్ణ

కూడేరు: 2024–25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం పాఠశాలల్లో ఉచితంగా అందించే బెల్టులు, నోట్ బుక్స్ మండల కేంద్రానికి సోమవారం సరఫరా అయ్యాయి. వాటిని కూడేరులోని ఎమ్మార్సీలో భద్ర పరిచారు. ఎంఈఓ-1 చంద్రశేఖర్, ఎంఈఓ-2 సాయి కృష్ణ వాటిని పరిశీలించారు. 2,556 బెల్టులు, 17,452 నోట్ పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమైన వెంటనే పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టులను విద్యార్థులకు అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు రమణ, శివ , ఆదిలక్ష్మి , ఎమార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణేలతో జంబుకేశ్వరుడికి విశేష అలంకరణ



నాణేల అలంకరణలో జంబుకేశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు రామకృష్ణ ఆధ్వర్యంలో జంబుకేశ్వరుడికి దాదాపు రూ.50 వేల విలువైన నాణేలతో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.స్వామికి పంచామృతాభిషేకం, రుద్రకవచాభిషేకం, మంగళ నైవేద్యాలు చేశారు.

కాశీ విశ్వేశ్వరుడికి పూజలు



అలంకరణలో కాశీ విశ్వేశ్వరుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన అతి పురాతన దేవాలయం, దక్షిణ కాశీగా పేరుగాంచిన కాశీ విశ్వేశ్వర దేవాలయంలో మూలవిరాట్‌కు సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమ అర్చనలు చేశారు. భక్తుల చేత మహా శివుడికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అలాగే నీలాంపల్లిలో వెలసిన నాగలింగేశ్వర దేవాలయంలో గా భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

బుగ్గ సంగాలలో ప్రత్యేక పూజలు

గుంతకల్లు: మండలంలోని బుగ్గ సంగాలలో ఉన్న బుగ్గ సంగమేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే సంగమేశ్వరుడు మూలవిరాట్‌కు అర్చకులు అభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న దానం చేశారు.

అంధకారం..అయోమయం

- కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కీలక పోస్టులన్నీ ఖాళీ
- అస్తవ్యస్తంగా సిబ్బంది పనితీరు
- సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి
- అవస్థలు పడుతున్న ప్రజలు



విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు కార్యాలయం



కణేకల్లులోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

కణేకల్లు: విద్యుత్ సరఫరా ఆగిపోతే అంతా అంధకారమే.. సిబ్బంది ఉన్నా సక్రమంగా పనిచేయకపోతే అంతా చీకటే.. కణేకల్లు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కీలకపోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. కిందిస్థాయి సిబ్బంది అరకొరగా ఉన్నా..అంతంతమాత్రమే పనిచేస్తుండడంతో ప్రజలు విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నారు. సమస్య తలెత్తితే ఎవరిని అడగాలో తెలియక అయోమయ పరిస్థితిలో ఉన్నారు. వర్షాకాలంలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుండడంతో ప్రజలు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కీలకపోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా ఏఈఈ, ఒక లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టుతోపాటు లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏఈఈ స్థాయి అధికారి లేనందున మిగిలిన సిబ్బంది పనితీరు గాడితప్పుతోంది. మరో వైపు కరెంటు సరఫరా సైతం అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత రెండు, మూడు నెలల నుంచి కీలక పోస్టులు ఖాళీగా ఉన్నా, ఏపీఎస్‌సీడీసీఎల్ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. గతంలో ఇక్కడ ఏఈఈగా పని చేస్తున్న శంకర్ నాయక్ రెండు నెలల క్రితం అనారోగ్యంతో సెలవుపై వెళ్లిపోయారు. అధికారులు ఆయన స్థానంలో మరొకరిని నియమించకపోగా, కనీసం ఏఈఈకు ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఇవ్వలేదు.

కీలకమైన లైన్‌మెన్ పోస్టులు ఖాళీ..

గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, విద్యుత్‌లైన్ల పర్యవేక్షణ ప్రక్రియలో కీలకపాత్ర పోషించే లైన్‌మెన్ పోస్టులు చాలా ఖాళీగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా లైన్‌మెన్ పోస్టులు ఐదు ఉండగా, ఒకరు మాత్రమే ఉన్నారు. ప్రధానంగా మండల హెడ్ క్వార్టరైన కణేకల్లులో లైన్‌మెన్ లేరు. మండలానికి ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు అవసరం కాగా, ఒకరు మాత్రమే ఉన్నారు. మరో పోస్టు ఖాళీగా ఉంది. మండలంలోని 30 గ్రామాలన్నీ లైన్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా చూసుకోవాల్సి వస్తోంది. ఇక్కడ సచివాలయంలో పని చేస్తున్న గ్రేడ్-2 జేఎల్ఎంలు మాత్రమే ఉన్నారు. వీరు మేజర్ గ్రామ పంచాయతీలో వీధిలైట్ల సమస్యలు పరిష్కరిస్తూనే, మరోవైపు విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని సమస్యలను కూడా చూడాల్సి వస్తోంది. అంబాపురం, జక్కలవడికి, గెనిగెర గ్రామాలకున్న లైన్‌మెన్ శ్రీధర్‌బాబు పనిభారాన్ని భరించలేక మూడు నెలల క్రితం మెడికల్‌లీవ్‌పై వెళ్లాడు. ఆలూరు, అడ్డమార్గం, కె.కొత్తపల్లి లైన్‌మెన్ పోస్టు ఖాళీగా ఉంది. బ్రహ్మసముద్రం, బెణికల్లు, ఎస్ఆర్ఎస్ క్యాంపులకు లైన్‌మెన్ పోస్టు ఖాళీగా ఉంది. కోకుర్తి, రచ్చుమర్రి, ఆదిగానిపల్లి గ్రామాల లైన్‌మెన్ పోస్టు ఖాళీగా ఉంది.

సిబ్బంది ఆడిందే ఆట..పాడిందే పాట :

విద్యుత్ శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, గ్రేడ్-2 జేఎల్ఎంలు సక్రమంగా పనిచేయాలంటే పర్యవేక్షణ అధికారి (ఏఈఈ) తప్పక ఉండాలి. ఇక్కడ ఏఈఈ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నారు. విధుల్లో ఉండాల్సిన వారు కూడా అందుబాటులో లేరు. బ్రేక్ డౌన్ అయినా, విద్యుత్ సరఫరా ఆగి, సరఫరాలో అంతరాయం కలిగినా పట్టించుకునేవారు లేరు. ఉదయం పూట ఒక్కసారి కరెంటు పోతే ఐదారు గంటల వరకు కరెంటు రాని రోజులేన్నో ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇక రాత్రిపూట కరెంటు పోతే ఆ రోజంతా చీకట్లో ఉండాల్సిందేనని ప్రజలు తెలిపారు. తెల్లారి ఉదయం 10 గంటలైనా కరెంటు సరఫరాను పునరుద్ధరించరని ప్రజలు తెలిపారు. తమ సమస్యలు చెప్పుకొందామని విద్యుత్ సబ్‌స్టేషన్‌కెళ్లితే అక్కడెవరూ ఉండరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ వర్కర్లపైనే ఆధారం:

గ్రామాల్లో విద్యుత్ సమస్యలొస్తే ప్రతి ఒక్కరూ ప్రైవేట్ వర్కర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి తలెత్తింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు పోవడం, కరెంటు పోల్ వద్ద జంపర్లు కట్ కావడంతోపాటు చెట్ల వద్ద విద్యుత్ తీగలు అతుక్కుపోయి కరెంటు సరఫరా బ్రేక్ డౌన్ అవుతోంది. దీంతో సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉన్న ప్రైవేట్ వర్కర్లను ఆశ్రయిస్తున్నారు. విద్యుత్‌శాఖలో ప్రైవేటు వర్కర్లతో పని చేయించుకోవడం చాలా తప్పు. జరగరానిది జరిగి, ప్రాణాల మీదకొస్తే ఎవరూ బాధ్యత తీసుకోరు. గతంలో చిన్న, చిన్న తప్పులతో కరెంటు షాక్ గురై పలువురు మృతి చెందగా, విద్యుత్ స్తంభాలపై నుంచి కిందకు పడి కాళ్లు, చేతులు పోగొట్టుకున్న వారు కూడా ఉన్నారు. ఉన్నాతాధికారులు స్పందించి కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్నాం

కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వివిధ పోస్టులు ఖాళీగా ఉన్నా, ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ సబ్‌స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా, బ్రేక్ డౌన్‌తోపాటు చిన్న సమస్యలు తలెత్తినా విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడినా అందుబాటులో ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేసి, పనులు చేయిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నాం.

– రవిచంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఏడీ

మాతాశిశు మరణాలు అరికట్టాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యారెడ్డి

కూడేరు: మాతాశిశు మరణాలను అరికట్టడమే ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం (పీఎంఎంవీవై) ముఖ్య ఉద్దేశమని వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి అన్నారు. సోమవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో పీఎంఎంవీవై పథకం కింద గర్భిణులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారిణి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు మొదటి నెల నుంచే పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. శిశువు ఎదుగుదల బాగుంటుందన్నారు. రక్త హీనతకు గురి కాకుండా చూసుకోవాలని గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రవీంద్ర, యశోధ, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఈశ్వరప్ప సేవలు ఆదర్శప్రాయం



ఉపాధ్యాయుడు ఈశ్వరప్ప, లలితమ్మ దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ మల్లారెడ్డి

బెళుగుప్ప: ఉపాధ్యాయుడు బులుగుండ్ల ఈశ్వరప్ప సేవలు ఆదర్శనీయమని, ఆయన ఉత్తమ విద్యాబోధనలతో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారని ఎంఈఓ మల్లారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉపాధ్యాయుడు ఈశ్వరప్ప ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా స్థానిక శ్రీవాసవీ కల్యాణమంటపంలో సన్మాన సభ నిర్వహించారు. ఈశ్వరప్ప, లలితమ్మ దంపతులను సన్మానించారు. ఈశ్వరప్ప 42 ఏళ్లుగా బెళుగుప్ప, శెట్టూరు, ఉరవకొండ మండలాల్లోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా సేవలందించారు. 2019లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో స్వాన్స్ క్లబ్ సంస్థ సభ్యులు, నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కురుబ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

- ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్



మాట్లాడుతున్న ఆర్డీటీ డైరెక్టర్ విశాల ఫెర్రర్

కంబదూరు: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పాటునందిస్తోందని ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్డీటీ మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసుకున్న స్త్రీ శక్తి మహిళా కోఆపరేటివ్ బ్యాంక్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం విశాల ఫెర్రర్ మాట్లాడుతూ ఆర్డీటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా సంఘాల సభ్యులు సొంతంగా బ్యాంకు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. బ్యాంక్ ద్వారా ఆర్థిక లావాదేవీలను సక్రమంగా జరుపుకొని, ప్రతి మహిళా లక్షాధికారి కావాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ సుబ్బరావు, ఆర్‌వైడీటీ రామాంజనేయులు, ఏటీఎల్ నారాయణ స్వామి, సీఓ భాగ్యనందస్వామి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయుక్తం



పిల్లలకు బహుమతులు అందించిన గ్రంథాలయాధికారిణి రాధారాణి

కూడేరు: గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు పిల్లలకు ఎంతో ఉపయుక్తమని, వారిలో ఆలోచనాశక్తి మారిందని గ్రంథాలయాధికారిణి రాధారాణి తెలిపారు. సోమవారం కూడేరు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపును ముగింపు సందర్భంగా పిల్లలకు బహుమతులు అందించారు. అనంతరం రాధారాణి మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో పిల్లలకు ఆట,పాటలు, జనరల్ నాలెడ్జ్, ఇతర వైజ్ఞానిక అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. పాఠ్యాంశలపైనే కాకుండా ఇతర అంశాలను నేర్చుకోవాల్లన్న ఉత్సాహం వారిలో పెరిగిందన్నారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

రన్నర్స్ జట్టుకు అభినందనలు



టీం సభ్యులకు కప్ అందజేస్తూ అభినందిస్తున్న డీఈఓ, ఏడీలు



బెస్ట్ బ్యాట్స్‌మెన్ వంశీని అభినందిస్తున్న డీఈఓ వరలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ నాన్ టీచింగ్ ఉద్యోగుల జోనల్ స్థాయి క్రికెట్ టోర్నీలో రన్నర్స్‌గా నిలిచిన ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు సభ్యులను జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి సోమవారం అభినందించారు. జోనల్‌స్థాయి క్రికెట్ టోర్నీ ఈనెల 8, 9 తేదీల్లో కర్నూలులో జరిగింది. కడపపై గెలిచిన అనంతపురం, చిత్తూరుపై గెలిచి కర్నూలు జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా నిలిచిన అనంతపురం జట్టు సభ్యులను డీఈఓతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు కృష్ణయ్య, నాగరాజు, సూపరింటెండెంట్లు అభినందించారు. కాగా ఈ టోర్నీలో ఒక మ్యాచ్‌లో 97 పరుగులు, మరో మ్యాచ్‌లో 44 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచిన డీఈఓ కార్యాలయ ఉద్యోగి వంశీ బెస్ట్ బ్యాట్స్ మెన్ అవార్డుకు ఎంపికయ్యారు. వంశీకి కప్ అందజేసిన విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



వడ్డుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఉన్న 3 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య సూచించారు. సోమవారం మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 3 సంవత్సరాలు పైబడిన పిల్లల్ని అంగన్‌వాడీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు రోజూ కొడిగుడ్డు, పాలు, భోజనం అందిస్తామని పేర్కొన్నారు. పిల్లలకు ఆటపాటలతో విద్యా బోధన చేస్తామన్నారు. పౌష్టికాహారంతో పిల్లల్లో మానసికంగా, శారీరక ఎదుగుదల ఉంటుందని తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

శంకరానంద డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు

గుంతకల్లు: స్థానిక శ్రీ శంకరానంద గిరి డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులను ప్రవేశపెట్టినట్లు కరస్పాండెంట్ హరి తెలిపారు. సోమవారం బీబీఏ విభాగం ప్రత్యేక స్టాఫ్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి ధ్యేయంగా నూతన కోర్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ ఏడాది బీబీఏ, బీసీఏ కోర్సులను ప్రవేశ పెట్టామన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపాల్, ఏవో డాక్టర్ చంద్రశేఖర్, బీబీఏ విభాగం అధ్యాపకులు వరప్రసాద్, శ్రావణి, సుభాషిని పాల్గొన్నారు.

జోడు లింగాలకు రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో జోడు లింగాలు

కూడేరు: కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్యక్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. సోమవారం శంభో శంకర హర హర మహాదేవ అంటూ భక్తులు పూజించారు. ఆలయ అర్చకులు శివపార్వతుల జోడు లింగాలకు రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామిని అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

గుండెపోటుతో కౌలు రైతు మృతి



ఎరుకల రవి (ఫైల్)

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లకు చెందిన కౌలు రైతు ఎరుకల రవి (38)గుండెపోటుతో సోమవారం మృతిచెందా డు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన ఎరుకుల రవి ఐదు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని మిరప పంట సాగు చేశాడు. పంటకు ధర లేకపోవడంతో పాటు, పెట్టుబడి కూడా రాలేదు. పంట పెట్టుబడికి, కుటుంబ పోషణకు దాదాపు రూ.8 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక మదనపడుతుండేవాడు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లాడు. అక్కడే గుండెపోటుకు గురై మృతిచెందాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అక్క దేవతలకు పూజలు



అక్క దేవతలకు హారతి ఇస్తున్న అర్చకుడు

ఆత్మకూరు: మండల కేంద్రంలో కొలువుదీరిన అక్క దేవతల ఉత్సవాలు ఇటీవల ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా సోమవారం అక్క దేవతలకు నెల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అక్క దేవతలకు ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

పుట్లూరు: రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు అందించాలని వ్యవసాయ సిబ్బందికి ఆత్మ పీడీ మద్దిలేటి సూచించారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సకాలంలో వర్షాలు వచ్చాయని, రైతులు పొలాల్లో సేద్యపు పనులు పూర్తి చేసుకుని వర్షపు నీరు ఇంకేలా చూసుకోవాలన్నారు. వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటల సాగు కోసం అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ శైలజా రైతులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కాత్యాయని, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

పెద్దపప్పూరు: మొక్కజొన్న, వేరుశనగ, పత్తి పంటల సాగులో మెలకువలు పాటిస్తే ఆశించిన దిగుబడి సాధించవచ్చని డీడీఏ మద్దిలేటి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో ఆయన పరిసర గ్రామల రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయా పంటల సాగులో ఆశించే తెగుళ్ల నివారణకు ఎలాంటి మందులు పిచికారీ చేయాలన్న విషయాన్ని రైతులకు వివరించారు. పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శైలజా కుమారి, ఏఓ ఆంజనేయులు, ఏఈఓ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పేరు చెరువుకు జలకళ



ఉరవకొండ నాల్గో వార్డులో లోతట్టు ప్రాంతంలోకి వచ్చిన వర్షపునీరు



ఇప్పేరు చెరువులోకి చేరిన వర్షపు నీరు

కూడేరు: మండలంలోని ఇప్పేరు చెరువుకు జలకళ వచ్చింది. కొద్ది రోజులుగా జోరుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షపునీరు వంకలద్వారా చెరువులోకి వచ్చి చేరుతోంది. ఇప్పేరు చెరువులో నీరు నిల్వ ఉంటే పి.నాగిరెడ్డిపల్లి, ఇప్పేరు, కూడేరు, అంతరగంగ గ్రామాల పరిధిలో భూగర్భజలాలు పెరుగుతాయి.

ఎడతెరపి లేకుండా వర్షం

ఉరవకొండ: పట్టణంలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో తగ్గు ప్రాంతాల్లోకి నీరు చేరింది. ఇంద్రానగర్, డ్రైవర్స్ కాలనీ, పాతపేట, లాలుస్వామి గుడిలోని వీధుల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. ప్రజలు అవస్థలు పడ్డారు. అరబిక్ హైస్కూల్ సమీపంలోని మసీదు ప్రాంగణంలో భారీగా వర్షపు నీరు నిలిచి, రాకపోకలకు ఇబ్బందిగా మారింది. క్లాక్‌టవర్ వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.